దంపతులకి చాలారోజులుగా సంతానం కలగదు. ఆమె జీవితం నిరాసక్తం అవుతుంది. డాక్టర్‌ని కలుసుకుంటుంది. ఆ డాక్టర్ ఆమెని పదమూడోరోజు రమ్మంటాడు.

ఎడిటర్ శాస్త్రికి అంతకుముందు పంపిన అడ్వర్టయిజ్‌మెంట్ గుర్తొచ్చింది. ప్రహసిత్‌తో మాట్లాడిన సంభాషణ గుర్తొచ్చింది. ఆ నవలకి పెట్టదగ్గ పేరు స్ఫురించింది.

పెన్ తీసుకుని వ్రాతప్రతిమీద పెద్ద అక్షరాల్తో టైటిల్ వ్రాశాడు.

13 ...... 14 ...... 15

## 3

సాయంత్రం అయిదింటికి రాజుని కలుసుకోవటానికి డాక్టర్ విశాల్ క్లినిక్‌కి వెళ్ళింది మధూహ. అక్కడి జనాన్ని చూసి ఆశ్చర్యపోయింది.

దాదాపు యాభైమంది దాక వున్నారు పేషెంట్లు. రాజు వాళ్ళందరితో బిజీగా వున్నాడు.

మధూహని చూసి నవ్వుతూ "చూశావా! మా ప్రకటన చూసి ఎవరూ రారన్నావు. ఎంతమంది వస్తున్నారో" అన్నాడు.

"మంచిదేగా" అంది మధూహ.

"నాక్కూడా నీ దగ్గిర ఉద్యోగం ఇవ్వరాదూ?".

"ఇంకొంచెం బిజినెస్ పెరగనీ. డాక్టర్‌గారికి చెప్పి ఇప్పిస్తాను. అవునూ మీ డాక్టర్‌గారు కనపడటం లేదేమిటి?".

“సంతానోత్పత్తి కేంద్రాన్ని ఆయన చూసుకుంటారు. దీన్ని నేను చూసుకుంటాను. నేనిప్పుడు కేవలం ఉద్యోగస్థుడిని కాననీ, నాకూ షేర్ ఇచ్చారనీ చెప్పాగా” అంటూండగా ఫోన్ మ్రోగింది.

రాజు రిసీవర్ తీసి మాట్లాడసాగాడు. అతడు మాట్లాడే విధానాన్ని బట్టి అట్నుంచి డాక్టర్ విశాల్ అని తెలుస్తోంది.

“ అలాగే సార్, అయిదు నిమిషాల్లో పంపుతాను” అని ఫోన్ పెట్టేశాడు.

మధూహ అక్కడే బల్లమీద వున్న పత్రిక చేతుల్లోకి తీసుకుంది.

“నువ్వు పత్రిక చదువుతూ వుండు. నేనిప్పుడే వస్తాను” అంటూ టాయిలెట్‌లోకి వెళ్ళాడు రాజు.

జనం అంతా కుర్చీలో కూర్చుని వున్నారు. వాళ్ళ తలలకి ఇనుపచట్రాల్లా ఏవో బిగించి వున్నాయి. బహుశ మాగ్నెట్స్ అయి వుండొచ్చు.
మైండ్ మాగ్నోథెరపీ ......

అందరూ కళ్ళు మూసుకుని నిద్రలో వున్నట్టున్నారు. ఏం చెయ్యాలో తోచక పత్రిక తిరగవేయటం ప్రారంభించింది.

ఒక చోట ఆగిపోయింది.

13 ...... 14 ...... 15

ఆమె తన కళ్ళని తానే నమ్మలేనట్టు మళ్ళీ చూసింది. ఉద్యోగం పోవటానికి ముందు తను అందచేసిన స్క్రిప్టే. అప్పుడే ప్రింటింగ్‌లోకి వచ్చేసింది. ఆమె మనసులో ఎడిటర్‌కి కృతజ్ఞత చెప్పుకుంది. తను రికమెండ్ చేసిన నవల వేసినందుకు.

ఆమె ఆ వారం సీరియల్ చదవబోయే సమయానికి రాజు లోపల్నించి వచ్చాడు. మనిషి కాస్త అలిసినట్టున్నాడు. నుదుటి మీద చెమట పట్టి వుంది.

"అలా వున్నావేం?" అడిగింది

"ఏం లేదు, బాగానే వున్నా" తడబాటు కప్పి పుచ్చుకుంటూ అన్నాడు రాజు. ఆమె ఆ విషయం రెట్టించలేదు.

హాల్లో పేషెంట్లు ఇంకా మేగ్నెట్ థెరపీలోనే వున్నారు.

దూరం నుంచి ఒక కుర్రాడు రావటం చూసి గుర్తు పట్టింది. వారం రోజుల క్రితం అతడిని ఇదే క్లినిక్‌లో చూసింది. అంతకు ముందు నెలరోజుల నుంచి వచ్చి చికిత్స పొందుతున్నాడు. అప్పటికి క్లినిక్ ఇంకా అంత పేరు తెచ్చుకోలేదు. అయిదుగురో పదిమందో వుండేవారు. వాళ్ళంతా ఆమెకు తెలుసు.

ఆ సంభాషణ ఇప్పటికీ జ్ఞాపకం వుంది.

"నీ పేరు"
"నా ...... నా ...... నాగరాజు"
"ఈ క్లినిక్‌కి దేనికోసం వచ్చావు?"
" న ...... న ...... నత్తి తగ్గించుకోవటం కోసం"
"ఎన్ని రోజులైంది చేరి?"
"న్నె ...... న్నె ...... నెల ర్రో ...... ర్రో ...... ర్రోజులు"
"మరింకెన్ని రోజులుండాలి"
"వా ...... వా"
"వారమా"
"అవును".

నెలరోజుల్లో తగ్గనిది ఇంకో వారంలో ఎలా తగ్గుతుంది? అ రోజు ఆ కుర్రాడు చెప్పడం ఆశ్చర్యమనిపించింది.

"మొత్తం ఒంట్లో వున్న శక్తినంతా ఈ నెలరోజుల్లో మేగ్నెట్ ద్వారా మెదడులోకి తెస్తారు. ఇప్పుడిక దాన్ని నాలుకలోకి పంపుతారు. దానికి వారం పడుతుంది అంతే".

"ఇంకో వారంలో నీ నత్తి తగ్గిపోతుందంటావ్".

“తప్పకుండా”

వారం తరువాత మళ్ళీ ఇప్పుడే ఈ కుర్రాడిని చూడటం. అతడు దగ్గరికి వచ్చాడు “ఈ రోజుకు అ ...... అ అయిదు వారాల కోర్సు అయిపోయింది” అన్నాడు రాజుతో.

“వెళ్లిరా బాబూ” అన్నాడు రాజు.
“నా ...... న ...... నత్తి తగ్గలేదు”.

“చెప్పలా, నూటికి ఒకరికి హిప్నాటిజం ఎక్కదు. అలాంటి కేసుల్లో నువ్వొకడివన్నమాట. ఏం చేస్తాం. మా ప్రయత్నాలన్నీ మేం చేశాం”.

అప్పుడు చిన్న కుర్రాడి కళ్ళలో కనపడిన నైరాశ్యాన్ని తరువాత చాలా కాలం వరకూ మర్చిపోలేకపోయింది మధూహ.

అతడు నిరాశగా వెనుతిరిగి భారంగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆమె అటే చూస్తూ “హిప్నాటిజం పట్టకపోవటమేమిటి రాజూ” అని అడిగింది.

“స్ట్రాంగ్ విల్‌పవర్ వున్న వాళ్ళకి ఇది పట్టదు”.

తనకి దృఢమైన మనస్సున్నందుకు ఆ కుర్రాడు సంతోషించాలా? నత్తి తగ్గనందుకు విచారించాలా?

సమాధానం రాకపోయేసరికి తల తిప్పి చూసింది. రాజు అక్కడ లేడు. పేషెంట్ల తలల్నుంచి చక్రాలు తీస్తున్నాడు

## 4

సాయంత్రం ఇంటికొచ్చాక మధూహ ఈ సీరియల్ చదవటం ప్రారంభించింది.

రాత్రి పదకొండయింది. అతడు అయిదు నిముషాల నుంచీ కాలింగ్ బెల్ కొడుతున్నాడు. భార్యవచ్చి తలుపు తీయలేదు. అతడికి ఆశ్చర్యంగా అనిపించింది.

సాధారణంగా తనొచ్చేవరకూ ఆమె ఎంతరాత్రయినా మేల్కొనే వుంటుంది. అటువంటిది ఈ రోజు తలుపు తీయటానికి రాలేదేమిటి?

మామూలుగా తను ఇంటికి వచ్చేసరికి ప్రతిరోజు పన్నెండు దాటుతుంది. ఈ రోజు తొందరగా రావటం వల్ల తలుపు తీయలేదా? అనుకున్నాడు.

అంతలో తలుపుల మధ్యలో సందు కనపడింది.

లోపల గడియ వేసి లేదు.

అతడికి ఆశ్చర్యం వేసింది. భార్యకేమయినా అయిందేమోనని భయం కూడా కలిగింది. తలుపు తోసుకుని లోపల ప్రవేశించాడు. లోపల బెడ్‌రూంలో భార్య పడుకుని వుండటం చూసి తేలిగ్గా వూపిరి పీల్చుకుని "ఒంట్లో బావోలేదా?" అని అడిగాడు.

"భోం చేస్తారా?"
"చేస్తాలే పడుకో ...... "

అతడు పావుగంటలో భోజనం ముగించి వచ్చి ఆమె పక్కన చేరాడు.

సన్నటి నడుము. ఎత్తయిన వంపులు. ఆమె పక్కకి తిరిగి పడుకుంటే చాలా అందంగా వుంటుంది. అందులోనూ ఇంకా పిల్లలు కలగకపోవటం వల్ల ఆమె వయసు ఇరవై ఎనిమిది అంటే ఎవరూ నమ్మరు.

అతడు ఒక క్షణం మామూలుగా పడుకుని ఆమె వైపు తిరిగాడు. అతడికి దాదాపు ప్రతిరోజూ కావాలి.

దగ్గిరగా జరిగాడు.

ఆమె అటు పక్కకి తిరిగి పడుకుని వుంది. అతడి చేతులు ఆమెనెక్కడో స్పృశిస్తున్నాయి. ఆ విషయంలో అతడు ఒకప్పుడు నేర్పరి. పెళ్ళయిన కొత్తలో ఆమెని బాగా మచ్చిక చేసుకునేవాడు. ఆమెకు చాలా నేర్పాడు. తరువాత ఉత్సాహం తగ్గిపోయింది. ఉద్యోగమూ, వ్యాపారమూ, స్నేహితులూ, పార్టీలూ...
రాత్రి ఎప్పుడో వచ్చాక ...... ఓ అరగంట తరువాత నిద్ర.

ఆ రోజు కూడా అలాగే అతడామెని తన వైపుకి తిప్పుకుని మీదకు వంగాడు. అంతే.

షాక్ తగిలినట్టు వెనక్కి వాలాడు. ఆమె కళ్ళు విప్పింది.

"ఏమిటిది?" అడిగాడు.
"షాగాను" అంది.
"వ్వాట్"
"సిగరెట్ కూడా షాగాను"

అతడి నిద్ర మత్తు వదిలిపోయింది. లేచి పక్కమీద కూర్చున్నాడు నమ్మశక్యం కానట్టు చూస్తూ. కోపగించుకోవాలో, అయోమయంలో పడాలో తెలియని స్థితిలో ఉండిపోయాడు.

ఆమె కూడా లేచి కూర్చోవటానికి ప్రయత్నించింది.

"ఈ రోజే ఎక్కడో చదివానండీ భూదేవి అని ఆడదాన్నంటార్ట కదా".

"అవును అంటారు. అయితే దానికీ నువ్వు మందు కొట్టటానికీ ఏమిటి సంబంధం?".

"షంబంధం? అవును షంబంధం ఏమిటి ? భూదేవి ఎక్కడా మందు కొట్టినట్టు దాఖలాలు లేవు కదా" అంటూ ఆమె ఏడవటం ప్రారంభించింది.

ఉన్నట్టుండి భార్య అలా ఏడుపు మొదలుపెట్టేసరికి అతను కంగారు పడ్డాడు.
అసలు మందు వ్యవహారంతోనే సగం నిర్వీర్యమై వున్నాడు.

"ఏడవకు వసుంధరా. అసలు విషయం చెప్పు".

"ఇంతమంది పాపుల్ని దివారాత్రాలు మోషే భూదేవి మందు కొట్టటం లేదండీ. పాపం ఇంత కష్టాన్ని ఎలా భరిస్తోంది?".

"నీకు మతిపోయింది భూదేవి మందు కొట్టటం ఏమిటి? అయినా కష్టాన్ని భరించటం కోసం మందుకొట్టటం ఏమిటి" చిరాగ్గా అన్నాడు.

"మరి మీరే చెప్పారు కదండీ. మొగాడన్నాక బోలెడు కష్టాలూ టెన్షన్లూ వుంటాయి. అందుకే రిలా ...... రిలా ...... రిలా ...... "

"రిలాక్స్"

"అదే, రిలాక్స్ అవటం కోసం మందు కొడ్తారని"

అతడు గతుక్కుమన్నాడు. ఆమె కొనసాగించింది.

"ఒక్క కష్టానికే మీరు మందు కొడ్తుంటే ఇన్ని కష్టాలున్న మనుషుల్ని మోస్తున్న భూదేవి ఎలా రిలాక్స్ అవుతుందో ఏమో. పాపం ఆవిడకి మందు కొట్టే ఛాన్సు లేదే అని ఏడుస్తున్నానండీ అవునూ ...... ఛాన్సు కరెక్టా? ఛాన్స్ కరెక్టా?".

"అది తరువాత గానీ ముందిది చెప్పు"

"ఏం షెప్పను?"

"నీ ఏడుపుకి కారణం నా కనవసరం. మందు ఎందుకు కొట్టావో చెప్పు".

"షెప్తా. ముందిది మీరు చెప్పండి. ఛాన్సు కరెక్టా? ఛాన్షు కరెక్టా?".

"ఛాన్సే కరెక్టు. ఇక చెప్పు"

"చాన్షు కరెక్టా"

“ఛాన్సు కాదు. ఛాన్సు”
“ఛాన్సు కాదు ఛాన్స్”
“నీ మొహం. ఛాన్సు ఛాన్స్”
“నేనూ అదే అంటున్నా కదండీ ఛాన్సు చా ...... ను”
“నాలుక్కోస్తా. ఛాన్సుకాదే ఛాన్సు”
“అయ్యో నాలుకేం చేసిందండీ! ఛాన్సు ఛాన్సు”
“ఏదో ఒకట్లే. విషయం చెప్పు”

“మీరు మందు కొట్టొచ్చి సుత్తి కొడ్తే నేను భరించటం లేదా. మందు కొట్టినవాడు మొగుడయినా సరే ఆ సుత్తి భరించటం కష్టమని ఒప్పుకుంటున్నారు కదా”.

“నీ లాజిక్కు తగలెయ్య. అసలు విషయం చెప్పు”

“నన్ను ముద్దు పెట్టుకుంటే చెప్తా”

“ఏమిటీ?”

“అదంతే”

అతడామెని ఆలాగే చేసి “చెప్పు” అన్నాడు.

‘అలా కాదు నోటిమీద”

“నీకు నిజంగా మతి భ్రమించింది”

“మీ ఇష్టం” అని వెనక్కి విరుచుకుపడిపోబోయింది. అతడామెని పట్టుకుని ముద్దు పెట్టుకోవటానికి వంగి చప్పున వెనక్కి జరిగి “ఏమిటీ! సిగరెట్ వాసనొస్తుంది” అన్నాడు.

“షెప్పాగా తాగానని”
“నిన్ను చంపేస్తా”

"ఇప్పుడు మాత్రం బ్రతికున్నానా ఏమిటి?"
"ఏమిటే ఇదంతా?"
"ముద్దు పెట్టుకుంటే చెప్తా"

అతడు అతికష్టంమీద దగ్గరకొచ్చి ఇక సాధ్యం కానట్టు దూరంగా జరిగి "కాల్చిన పొగాకు వాసన కడుపులో దేవేస్తోంది" అన్నాడు. అతడి మాటలు పూర్తి కాకుండా ఆమె అతడిని కదలకుండా పట్టుకుని నోట్లో నాలుక పెట్టి గట్టిగా బిగించింది. అతడు విలవిలలాడాడు. గింజుకున్నాడు. ఆమె వదల్లేదు. ఆ తరువాత అతడిని వదిలిపెడ్తూ "కరెక్టే కరెక్టే" అని చిన్న పిల్లలా కేరింతలు కొట్టసాగింది. ఆమెని పీకపిసికి చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది. అయినా దానికన్నా ఎక్కువగా ఆమె ప్రవర్తన కంగారు పెట్టటంతో "ఏమైంది? ఏది కరెక్టు" అన్నాడు పెదాలు తుడుచుకుంటూ.

"మధ్యాహ్నం మేగ్‌జైన్‌లో చదివానండీ. స్త్రీకి భూదేవి అని పేరొచ్చింది పిల్లల్ని కన్నందుకూ సహనంతో అత్తామామల్ని చూసినందుకూ కాదట. సిగరెట్ తాగే మొగుడిని ముద్దు పెట్టుకోగలిగేటంత సహనం ఏర్పరచుకున్నందుకట. తాగి వొచ్చినప్పుడు భరించినందుకట ...... "

...... సశేషం

ఆ వారం సీరియల్ చదివి మధూహ నవ్వు ఆపుకోలేకపోయింది. పత్రిక పక్కన పెట్టి బయటకొచ్చి ఎడిటర్‌కి ఫోన్ చేసింది.

"శాస్త్రిని మాట్లాడుతున్నాను"
"నేను సర్, మధూహని మాట్లాడుతున్నాను. థాంక్స్"
"ఇందులో నేను చేసింది ఏముందమ్మాయ్. స్క్రిప్ట్ బావుంది వేస్తున్నాను".
"ఇంతకీ ఆ రచయిత్రి ఎవరో తెలిసిందాండీ!"

"లేదమ్మా, తరువాత స్క్రిప్టు కూడా పంపింది కానీ అడ్రసు మాత్రం ఇవ్వలేదు. రచయిత్రి పేరు లక్ష్మి అని వ్రాసింది కానీ అది కూడా కలం పేరు అనుకుంటాను" అన్నాడు ఎడిటర్.

ఆ రచయిత్రి తన స్నేహితురాలు లక్ష్మేనని మధూహ వూహించలేకపోయింది. సాదాగా కనపడే లక్ష్మిలో అంత లోతయిన భావాలుంటాయని ఆమె కలలో కూడా అనుకోలేదు. అదీగాక ఆమె దృష్టిలో లక్ష్మి విష్ణులది చాలా మంచి దాంపత్యం.

తన నిరాసక్తతని లక్ష్మి ఎన్నడూ బయటివాళ్ల ముందు బయట పెట్టదు.

ఈ ప్రపంచంలో చాలా మంది ఆడవాళ్ళలాగే పైకి చాలా హుషారుగా, తమది అన్ని సంసారాల్లాగే మామూలుగా గడిచిపోతూందన్నట్టు వుంటుంది.

"అన్నట్టు ఈ మధ్య పత్రికాఫీసుకి రావటం మానేశావేమిటమ్మాయ్"
"ఉద్యోగంలోంచి తీసేశారు కదండీ" నిష్ఠూరంగా అంది.
"ఉద్యోగం అంటే గుర్తొచ్చింది. నీకో ఉద్యోగం ఇస్తాను చేస్తావా?".